క్లుప్తంగా

రంగడి సన్నిధిలో 16న సప్తవాహన సేవలు

నెల్లూరు(బృందావనం): రథ సప్తమిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో సప్తవాహన సేవలను ఈ నెల 16న నిర్వహించనున్నామని ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజా కార్యక్రమాలకు భక్తులు తరలిరావాలని కోరారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెస్సెమ్‌ఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛమిచ్చి సత్కరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు నెల్లూరు పవన్‌కుమార్‌రెడ్డి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త జయరామ్, ఈఓ వెంకటశ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవం నేడు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహాలను బుధవారం ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నగరంలోని వెంకటేశ్వరపురం, అల్లీపురం, కల్లూరుపల్లి, కొండ్లపూడి, ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపాన, అక్కచెరువుపాడు ప్రాంతాల్లో రెండు విడతల్లో నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించనున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలం సురేష్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారు.

16న మెగా జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): జాబ్‌మేళాను ఈ నెల 16న నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 11 కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. అసెంచర్, టెక్ మహీంద్ర, సదర్‌ల్యాండ్, టెలిపర్ఫార్మెన్స్, ఏజీఎస్ హెల్త్‌కేర్, జియో, ముథూట్ ఫైనాన్షియల్ సర్వీసెస్, కెరీర్ స్కూల్, టైక్ కాస్టింగ్, బ్లూ స్టార్ ఇండియా తదితర కంపెనీల్లో ఉద్యోగాలకు గానూ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారని వివరించారు. సీడాప్, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించనున్న జాబ్‌మేళాకు పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదివిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30కు నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

దత్త విజయానందతీర్థ రాక నేడు

నెల్లూరు(బృందావనం): మైసూరు అవధూత దత్త పీఠ ఉత్తరాధీశ్వరులు దత్త విజయానందతీర్థ నెల్లూరుకు బుధవారం సాయంత్రం రానున్నారని డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రథసప్తమిని పురస్కరించుకొని సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ, అష్టలక్ష్మి మందిర ప్రాంగణంలో గురు, శుక్రవారాల్లో నిర్వహించనున్న విశేష పూజలు, యాగాలు, అర్చనలు, దివ్యనామ సంకీర్తనల్లో ఆయన పాల్గొననున్నారని చెప్పారు. భక్తులు విశేషంగా హాజరుకావాలని కోరారు.

పోలేరమ్మకు పొంగళ్ల సమర్పణ

పొదలకూరు : పొదలకూరు, చిట్టేపల్లి, లింగంపల్లి గ్రామదేవతగా పూజలందుకుంటున్న పట్టణంలోని పోలేరమ్మ తల్లికి చిట్టేపల్లి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో సామూహిక పొంగళ్లను పెట్టుకున్నారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి పూజా సామగ్రితో బాణసంచా, తప్పెట్ల నడుమ కాలినడకన దేవస్థానానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి నైవేద్యాన్ని సమర్పించారు. గ్రామం పాడి పంటలు, సుఖశాంతులతో ఉండాలని ప్రతి ఏడాది పొంగళ్లు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తున్నట్లు భక్తులు వెల్లడించారు. కార్యక్రమానికి విచ్చేసిన మహిళలకు తీర్థప్రసాదాలతో పాటు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రజలకు అండగా ప్రభుత్వం



పట్టాలను అందజేస్తున్న ఖలీల్ అహ్మద్

- ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎప్పటికీ అండగా ఉంటుందని పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. నగరంలోని 11వ డివిజన్ కొండారెడ్డిదిబ్బకు చెందిన 60 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఇంటింటికీ వెళ్లి మంగళవారం పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధితో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.


డీసీఎమ్మెస్ పాత రైస్‌మిల్లు స్థలంలో పరిశీలన



చలపతిరావుతో చర్చిస్తున్న నిపుణుల కమిటీ సభ్యులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నవాబుపేటలో డీసీఎమ్మెస్‌కు చెందిన పాత రైస్‌మిల్లు స్థలాన్ని నిపుణుల కమిటీ సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఈ స్థలంలో ఎలాంటివి నిర్మిస్తే డీసీఎమ్మెస్‌కు ఆదాయ వనరులు చేకూరుతాయనే అంశమై చైర్మన్ వీరి చలపతిరావుతో శ్యామ్‌కుమార్ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేటివ్ మేనేజ్‌మెంట్, హైదరాబాద్), రమణ (చెన్నై) చర్చించారు. అనంతరం చలపతిరావు మాట్లాడారు. 1.25 ఎకరాల స్థలంలో రైస్‌మిల్లు ఉండేదని, వీటిని తొలగించిన క్రమంలో షాపింగ్ కాంప్లెక్స్, విత్తనాల శుద్ధి కర్మాగారం, కన్వెన్షన్ హాల్ లాంటివి నిర్మిస్తే డీసీఎమ్మెస్ ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని గతంలోనే పాలకమండలి తీర్మానించిందన్నారు. ఈ పనులను ఆత్మనిర్భర్ భారత్ ద్వారా చేపట్టేలా చూడాలని కోరారు. డీసీఎమ్మెస్ బీఎం వెంకటస్వామి, పాలకమండలి సభ్యులు ఖిల్జీ అహ్మద్, రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

‘తల్లడిల్లే తల్లివేరు’ పుస్తకావిష్కరణ



నెల్లూరు(బృందావనం): అభ్యుదయ రచయితల సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జగ్గయ్యపేటకు చెందిన కవి సరికొండ నరసింహరాజు మాతృభాషపై రచించిన తల్లడిల్లే తల్లివేరు పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. రామ్‌నగర్‌లోని సంఘ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు పెరుగు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు టీకుమళ్ల వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు, కండక్టర్ల సేవలు అమోఘం



మాట్లాడుతున్న చందర్

నెల్లూరు సిటీ: డ్రైవర్లు, కండక్టర్ల సేవలను ఉప రవాణా కమిషనర్ చందర్ అభినందించారు. రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర, జోన్, జిల్లా స్థాయిలో ప్రమాదరహిత డ్రైవర్లుగా కొనసాగుతున్న వారికి ప్రశంస పత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్, నెల్లూరు ఈడీ ఆదామ్ సాహెబ్, రీజినల్ మేనేజర్ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు సిటీ: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి ఎనిమిదిన నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అన్ని శాఖల వారు సహకారం అందించాలని కోరారు. డాక్టర్ ఇందిరా, డాక్టర్ కిరణ్, సర్దార్ సుల్తాన్, రవీంద్ర, రూప, కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ చేసి.. ఆపై చిత్రహింసలు

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో డిగ్రీ విద్యార్థిని కొందరు కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేసిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. తిరుపతి జిల్లా వాకాడు మండలానికి చెందిన సాయినందన్ నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతూ స్థానికంగా ఓ గదిని అద్దెకు తీసుకొని ఉంటున్నారు. బుజబుజనెల్లూరుకు చెందిన వంశీకుమార్‌తో ఈయనకు పాతకక్షలున్నాయి. ఈ నేపథ్యంలో సాయినందన్ తన స్నేహితుడితో కలిసి బృందావనంలోని గణేష్ మెస్ వద్ద ఆదివారం ఉండగా, వంశీకుమార్ తన స్నేహితులతో కలిసి కారులో అక్కడికి చేరుకున్నారు. సాయినందన్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకున్నారు. అడ్డుకోబోయిన స్నేహితుడు జశ్వంత్‌ను తోసేసి అక్కడి నుంచి నిందితులు పరారయ్యారు. ఘటనపై సంతపేట పోలీసులకు జశ్వంత్ ఫిర్యాదు చేశారు. సాయినందన్‌ను కనుపూరు వద్దకు కిడ్నాపర్లు తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేశారు. సాంకేతికత ఆధారంగా ఘటన స్థలానికి చేరుకొని సాయినందన్‌ను కిడ్నాపర్ల చెర నుంచి పోలీసులు విడిపించారు. నిందితులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కేసుపై విచారణ జరుపుతున్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న దేవీకుమారి

నెల్లూరు(బారకాసు): నెల్లూరు సిటీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలోని అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని ఏఈఆర్వో దేవీకుమారి మంగళవారం నిర్వహించారు. కొన్ని అంశాలను రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలియజేయగా, ఆమె సానుకూలంగా స్పందించారు. టీడీపీ తరఫున హరికృష్ణ, బీజేపీ నుంచి రాధాకృష్ణ, దినేష్‌నాయుడు, ఎన్నికల విభాగానికి చెందిన చక్రపాణి పాల్గొన్నారు.

కళాత్మక ఆహ్వానం



నెల్లూరు(బృందావనం): మైసూరు దత్తపీఠ ఉత్తరాధీశ్వరులు దత్తవిజయానంద తీర్థ ఆగమనాన్ని పురస్కరించుకొని మూలాపేటకు చెందిన సూక్ష్మ చిత్ర కళాకారుడు గంధవళ్ల ఉమాశంకర్ కళాత్మకంగా ఆహ్వానం పలికారు.
స్వామి ఇష్టదైవమైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని రావి ఆకుపై కళాత్మకంగా కార్వింగ్‌తో తీర్చిదిద్దారు.

జేఈఈ మెయిన్స్‌లో ‘కృష్ణచైతన్య’ విజయకేతనం



నెల్లూరు (టౌన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ కళాశాలల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలల చైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్ రాజాప్రమోద్ రెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ మార్కులను సాధించిన విద్యార్థులను కళాశాలలో మంగళవారం అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. హర్షవర్ధన్ 99.82, ప్రతాప్‌నాయుడు 99.42, సూర్యప్రకాష్ 97.41, విక్రమ్ 97.27, దివ్యశ్రీ 97.18, జ్యోతిర్మయి 97.06 పర్సంటైల్‌ను సాధించారన్నారు. ఒకే క్యాంపస్ నుంచి 95 పర్సంటైల్‌కుపైన 11 మంది, 90 పర్సంటైల్‌కుపైగా 21 మంది సాధించారని వివరించారు. డీన్ శిరీష్‌బాబు, అకడమిక్ డీన్ రామ్‌గోపాల్‌రెడ్డి, అడ్మిన్ డీన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

‘శ్రీచైతన్య’ విజయభేరి



నెల్లూరు (టౌన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారని కళాశాల డీన్ శ్రీరామ్ పేర్కొన్నారు. ఉత్తమ మార్కులను సాధించిన విద్యార్థులను నగరంలోని కళాశాలలో మంగళవారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. ధనుశ్రీ 97.08, లేఖన 96.55, భానుతేజ 96.20, యజ్ఞశ్రీ 95.48, తన్వీర్ సిద్దిఖ్, భవానీ 94.08 పర్సంటైల్‌ను సాధించారని చెప్పారు. 90 పర్సంటైల్‌కుపైగా 22 మంది, 85 పర్సంటైల్‌కుపైగా 31 మంది, 80 పర్సంటైల్‌కుపైగా 42 మంది విద్యార్థులు సాధించారన్నారు.

‘నారాయణ’ ఉత్తమ ప్రతిభ



నెల్లూరు (టౌన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నారాయణ జూనియర్ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారని విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను నగరంలోని కళాశాలలో మంగళవారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. షేక్ సూరజ్ 100 పర్సంటైల్‌ను సాధించారని వివరించారు. రితేష్‌రెడ్డి 99.92, శ్రీనికేష్ 99.91, చరితసాయి సుష్మా 99.90, లావణ్యచంద్రిక 99.83, అభితేష్, సాయినితీష్ 99.77, దినేష్‌కార్తీక్ 99.74, శ్రీరామ్‌సుహాస్ 99.72, విరించి 99.71 పర్సంటైల్‌ను సాధించారని పేర్కొన్నారు.

‘ఓవెల్’ విజయదుందుభి



నెల్లూరు (టౌన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఓవెల్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారని కళాశాల చైర్మన్ వేణు పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థులను మంగళవారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. సంతోష్ కుమార్‌యాదవ్ 99.83, నిఖిత్‌బాబు 99.74, రాకేష్‌కుమార్ 99.46, అర్పితా సాజిత్ 99.43, గీతేశ్వర్ 98.93, అఖిల్ 98.54, వీరసాత్విక్ 98.43, రిహాన్ 98.01 పర్సంటైల్‌ను సాధించారని చెప్పారు. సీఈఓ ప్రమీల, జీఎం మహదేవన్, ఈడీ బాలు, డీజీఎం వహాబ్, ఏజీఎం గంగాధర్, వైస్ ప్రిన్సిపల్ కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘విశ్వసాయి’ హవా



దివ్యశ్రీ

నెల్లూరు (టౌన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విశ్వసాయి జూనియర్ కళాశాలల విద్యార్థులు విజయఢంకా మోగించారని కళాశాల చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. ఉత్తమ మార్కులను సాధించిన విద్యార్థులను అన్నమయ్య సర్కిల్లోని కళాశాలలో మంగళవారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. దివ్యశ్రీ 97.82, యశ్వంత్ 97.52 పర్సంటైల్‌ను సాధించారని పేర్కొన్నారు. కళాశాలకు చెందిన 96 మందికిపైగా విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ పర్సంటైల్‌ను సాధించారని వివరించారు.

‘అపోలో’కు జాతీయ స్థాయిలో గుర్తింపు



అవార్డును చూపుతున్న శ్రీరామ్‌సతీష్

నెల్లూరు సిటీ: నగరంలోని అపోలో ఆస్పత్రికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. ఈ క్రమంలో ముంబైలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ శ్రీరామ్ సతీష్ అందుకున్నారు. ముంబై కేంద్రంగా మెడికల్ అలర్ట్స్ సంస్థ ఈ అవార్డును ఏటా అందిస్తోంది. ఈ క్రమంలో నగరంలోని అపోలో ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో శ్రీరామ్ సతీష్, యూనిట్ హెడ్ బాలరాజు మాట్లాడారు. జాతీయ స్థాయిలో అవార్డు లభించడంపై ఆనందం వ్యక్తం చేశారు.

నరసింహకొండపై భక్తుల భద్రత గాలికి..

- కోతుల బీభత్సం
- కోతి దాడిలో తాజాగా ఓ మహిళా భక్తురాలికి తీవ్రగాయాలు

నెల్లూరు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై భక్తుల భద్రతను దేవదాయశాఖ గాలి కొదిలేసింది. భక్తుల భద్రతను పర్యవేక్షించడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. నరసింహకొండపై కొంత కాలంగా కోతుల బెడద అధికంగా ఉంది. వేదగిరి లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవారి సన్నిధితో పాటు ఆలయ బయట కోతులు స్వైరవిహారం చేస్తూ భక్తులపై తరచూ దాడి చేస్తున్నాయి. తాజాగా స్వామివారి దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలిపై కోతులు మంగళవారం దాడి చేశాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమె నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు.

సిబ్బంది నిర్లక్ష్య సమాధానాలు

భక్తుల భద్రతను ఇక్కడి ఆలయాధికారులు, సిబ్బంది ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో భక్తులు అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. కొండపై కోతులు కాకుండా ఇంకేమి ఉంటాయంటూ ఆలయ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొండపై సుమారు 500 వరకు కోతులు ఉండొచ్చని అంచనా. ఇటీవల కొన్నింటిని పట్టి సమీపంలోని బుచ్చిరెడ్డిపాళెంలో వదలేయగా, అవి మళ్లీ నరసింహకొండకు చేరుకున్నాయని తెలిసింది. అధిక నిధులను వెచ్చించి సెక్యూరిటీ సిబ్బందిని నియమించినా, వారు సక్రమంగా పనిచేయడంలేదని తెలుస్తోంది. భక్తులపై కోతులు దాడులు చేస్తున్నాయని తెలిసినా.. సెక్యూరిటీ సిబ్బంది కనిపించిన దాఖలాల్లేవని పలువురు మండిపడుతున్నారు. ఈ విషయాన్ని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ సురేంద్రరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపడతామంటూ భక్తులను సముదాయించారు.

వైఎస్సార్సీపీ కార్యాలయం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఖలీల్ అహ్మద్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీలో కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం జగనన్న భవన్‌ను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ మాట్లాడారు. 53, 54వ డివిజన్ల పార్టీ నేతలు, కార్యకర్తల కోసం పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. రానున్న ఎన్నికల్లో పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కేంద్రీయ విద్యాలయంలో 23, 24న ఇంటర్వ్యూలు

నెల్లూరు రూరల్: కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్ట్ టీచర్ల నియామకానికి సంబంధించిన ఇంటర్వ్యూలను ఈ నెల 23, 24న నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శంకరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించి పీజీ చదివిన అభ్యర్థులను నియమించనున్నారని పేర్కొన్నారు. ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు సంబంధించి ఇంగ్లిష్, మ్యాథ్, సోషల్, సైన్స్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు 23వ తేదీ ఉదయం పది గంటలకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామని చెప్పారు. ప్రైమరీ టీచర్, స్పోర్ట్స్, మ్యూజిక్ కోచ్‌లు, స్పెషల్ ఎడ్యుకేటర్, ఎడ్యుకేషన్ కౌన్సెలర్, తెలుగు, యోగా టీచర్ల నియామకానికి ఇంటర్వ్యూలను 24న నిర్వహించనున్నామని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు గంట ముందే విద్యాలయానికి చేరుకొని తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోను తీసుకురావాలని, వివరాలకు విద్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి ఆందోళన కార్యక్రమాలు



మాట్లాడుతున్న పెంచలరావు

నెల్లూరు(పొగతోట): ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల సమస్యల సాధన కోసం ఈ నెల 14 నుంచి 27 వరకు ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నామని ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ పెంచలరావు పేర్కొన్నారు. నగరంలోని ఎన్జీఓ హోమ్‌లో మంగళవారం నిర్వహించిన ఏపీ జేఏసీ సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. ఉద్యోగులు నల్లబ్యాడ్జీలను ధరించి విధులకు హాజరుకానున్నారని చెప్పారు. ఏపీ జేఏసీ కన్వీనర్ నాయుడు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.